# ప్రజాశక్తి

సోమవారం 27 అక్టోబర్ 2025 8 పేజీలు




ప్రకాశం



బాపట్ల

## విద్యాసంస్థలకు 3 రోజులు సెలవు

### ప్రకాశం కలెక్టర్ రాజాబాబు

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

మొంథా తుఫాన్ నేపథ్యంలో ఈ నెల 27, 28, 29 తేదీలలో జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు.మొంథా తుఫాన్ కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా నివారించే ఉద్దేశంతో జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు గురుకుల పాఠశాలలు, కళాశాలలు. ఇతర విద్యాసంస్థలు అన్నింటికి 3 రోజులపాటు సెలవు దినాలుగా కలెక్టర్ ప్రకటించారు.

## నేడు పిజిఆర్ఎస్ రద్దు

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్, బాపట్ల జిల్లా**

మొంథా తుపాన్ దష్ట్యా సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ప్రకాశం, బాపట్ల కలెక్టర్లు పి.రాజాబాబు, వినోద్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా కేంద్రాలకు రావద్దని కోరారు.

# తుపాన్ ముప్పు తప్పదా.?

- నేటి నుంచి మూడు రోజులు.. 'మొంథా' ప్రభావం
- ప్రకాశం స్పెషల్ ఆఫీసర్‌గా కోన శశిధర్ నియామకం
- ఒంగోలు చేరుకున్న ఎస్‌డిఆర్ఎఫ్ టీమ్




ఒంగోలుకు వచ్చిన ఎస్‌డిఆర్ఎఫ్ టీమ్

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

**'మొంథా' తుపాన్ ముప్పు ప్రకాశం జిల్లా తప్పదా.? అంటే అవుననే సమాధానం వస్తోంది. వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మొంథా తుపాన్ ఈ నెల 28న అర్ధరాత్రి మచిలీపట్నం - కళింగ పట్నం మధ్య కాకినాడ వద్ద తీరం దాటే అవకాశం ఉంది. తుపాన్ ప్రభావం ఈ నెల 27, 28, 29 తేదీలలో ప్రకాశం జిల్లాపై పడనుంది. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్‌ను ప్రకాశం జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించింది. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో 27 మంది సభ్యులతో కూడిన ఎపిఎస్‌డిఆర్ఎఫ్(స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) ఒంగోలు చేరుకుంది. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని పాఠశాలలకు మూడు రోజుల సెలవులను కలెక్టర్ పి.రాజాబాబు ప్రకటించారు.**

బంగాళాఖాతంతో తీవ్ర వాయుగుండం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయువ్యదిశగా కదిలి తుపాన్ మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గడచిన 6 గంటలలో వాయుగుండం గంటకు 6 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. విశాఖకు దక్షిణ ఆగ్నేయంగా 830 కిలోమీటర్లు, కాకినాడకు ఆగ్నేయంగా 830 కిలోమీటర్ల దూరంగా కేంద్రీకృతమైంది. ఆదివారం రాత్రి నైరుతి పశ్చిమ బంగాళాఖాతంలో తుపాన్‌గా మారే అవకాశం ఉంది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్

### ఆందోళనలో అన్నదాతలు

వాయుగుండం కారణంగా గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు 7942 హెక్టార్లల్లో జొన్న, సజ్జ, మొక్కజొన్న, పత్తి, వరి, కంది, మినుములు వంటి పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలోని 21 మండలాలలోని 152 గ్రామాలలోని 8888 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. మళ్ళీ మొంథా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

### ఒంగోలు చేరుకున్న ఎస్‌డిఆర్ఎఫ్ బృందం

తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ఎపి స్టేట్ డిజాస్టర్ రెస్క్యూ టీమ్(ఎపిఎస్‌డిఆర్ఎఫ్) బృందం ఒంగోలు చేరుకుంది. గుంటూరు ఆరో బెటాలియన్‌కు చెందిన 27 మంది సభ్యుల బృందం ఒంగోలు అంబేద్కర్ భవన్‌లో ▶ 2లో

# మత్స్యకారులకు న్యాయం జరిగేనా.?

- ధనిక రైతు డికె పట్టాపై సందేహాలు
- కమిటీలు, నివేదికలతో కాలయాపన చేస్తున్న అధికారులు



ఈపురుపాలెం స్ట్రైయిట్‌కట్ సముద్ర ముఖ ద్వారం వద్ద సర్వే నెం 499-2 వివాదాస్పద భూమి

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

**జిల్లాలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. తీరం అంతటా రిసార్టులు వెలుస్తున్నాయి. ఇక్కడ ఎకరం ధర కోట్ల రూపాయలు పలుకుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక ధనిక రైతుగా ఉన్న చీరాల మండలం, పిట్టువారిపాలెంకి చెందిన బుర్ల వెంకట్రావు.. 499-2 సర్వే నెంబర్‌లో తనకు 1986లో డికె పట్టా ఇచ్చారని, ఈ భూమి తనదే అంటూ దశాబ్ధాలుగా మత్స్యకారులు తమ పడవల రాకపోకలకు ఉపయోగిస్తున్న స్ట్రయిట్‌కట్ కాలువ వంపును మూసి వేసి.. సహజసిద్ధంగా ఏర్పడిన కాలువ దిశను మార్చారు. తన డికె పట్టా భూమి కోతకు గురవుతుందంటూ కాలువలో కొండరాళ్లను అడ్డుగా వేశారు. ఈ చర్యల కారణంగా తాము నష్టపోతున్నామంటూ మత్స్యకారులు న్యాయం కోసం సుదీర్ఘకాలంగా ఆందోళన చేస్తున్నారు. అధికారులు కమిటీలు, నివేదికల పేరుతో కాలయాపన చేస్తున్నారు.**

ఈ నేపథ్యంలో ధనిక రైతు వెంకట్రావు డికె పట్టా విషయమై అనేక సందేహాలు, అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెవెన్యూ వారు 1986 లో తనకు డికె పట్టా ఇచ్చినట్లు చెబుతున్నారు. గుంటూరు జిల్లా, బాపట్ల మండలం, అడవి పంచాయతీ పరిధిలో ఉన్న భూమిని ఆనాటి ప్రకాశం జిల్లా చీరాల మండలం, పిట్టువానిపాలెం గ్రామానికి చెందిన వెంకట్రావుకు ఏ ప్రాతిపదికన పట్టా ఇచ్చారో అర్ధం కాదు. సహజంగా ఎక్స్ ఆర్మీ, రాజకీయ బాధితులు, స్వతంత్ర సమరయోధులు, భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం డికె పట్టా ఇస్తుంది. బుర్ల వెంకట్రావు తనదని చెబుతున్న 499-2 సర్వే నెంబర్ లో ఉన్న 3.42 ఎకరాల భూమిలో ఏ పంట పండించడం సాధ్యం కాదు. ఎందుకంటే ఈ భూమిలో నుంచే స్ట్రయిట్‌కట్ కాలువ సముద్రంలో కలుస్తుంది. ఈ భూమి పూర్తిగా సముద్రపు అలలను తాకుతూ ఉంది. ఈ భూమిలో గతంలో ఏ పంటలూ పండించే అవకాశం లేదు. భవిష్యత్తులో కూడా ఏ పంటలు పండించడం సాధ్యం కాదు. రొయ్యల సాగు కూడా ఇక్కడ వీలు కాదు. మరి వ్యవసాయానికి ఉపయోగపడని భూమిలో పంటల సాగు కోసం రెవెన్యూ వారు ఎలా డికె పట్టా ఇచ్చారో వారే చెప్పాలి.

ఈపురుపాలెం స్ట్రైయిట్ కట్ సముద్ర ముఖ ద్వారం (సీ మౌత్) వద్ద సర్వే నెం 499-2లో బుర్ల వెంకట్రావు పేరుతో ఉన్న డీకే పట్టా అక్రమ పద్ధతుల్లో సృష్టించిందన్న అనుమానాలను మత్స్యకారులు వ్యక్తం చేస్తున్నారు. 1986లో ఇచ్చినట్లుగా చెబుతున్న డికె పట్టాపై అప్పటి తహశీల్దార్ ఎం.పుల్లయ్య సంతకం ఉంది. కానీ ఆనాడు ▶ 2లో

### తుపాన్‌ను ఎదుర్కొనేందుకు

# సిద్ధంగా ఉండాలి..

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**ప్రజాశక్తి- బాపట్ల జిల్లా**

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ప్రభావం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హల్ ఏర్పాటుచేసిన కమ్యాండ్ కంట్రోల్ రూమ్ నుంచి రెవెన్యూ, పౌర సరాఫరాలు, విద్యుత్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖల జిల్లా అధికారులతో జిల్లాలో తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన ముందస్తు చర్యలపై వీక్షణ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27 నుండి బంగాళాఖాతంలో ఏర్పడుతున్న తుఫాను వల్ల జిల్లాలోఎక్కడ కూడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావం సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. తుఫాన్ సమయంలో గర్భిణులు, పాలిచ్చే తల్లులు, వద్ధులు సురక్షితంగా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కూరగాయలు అందుబాటులో ఉంచేందుకు డీసెంట్రలైజ్డ్ రైతు బజార్లు ఏర్పాటు చేయాలని మార్కెట్ ఏడిని ఆదేశించారు. తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

**ప్రజాశక్తి-పొదిలి**

మెడికల్ కాలేజీల్లో ప్రైవేటీకరణ దుర్మార్గమని మార్కాపురం వైసిపి ఇన్‌ఛార్జి గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. ఆదివారం పొదిలి పట్టణంలో బ్యాంక్ కాలనీలో వైసిపి అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దోర్నాల వరలక్ష్మమ్మ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలో ప్రైవేటు టికెట్లకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్యక్రమంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన గిద్దలూరు, కంభం మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాసరెడ్డిలకు ఘన స్వాగతం లభించింది. ముందుగా



మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు స్వాగత దృశ్యం

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, కెవి రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు, ఎస్కె నూర్జహాన్ బేగం, ఎస్‌కే మస్తాన్‌వలి, జి శీను, పిచ్చిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు న్యాయం జరిగేనా ?

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పెట్టిన సంతకాలన్నీ ఇంగ్లీషులో ఉన్నాయి. అయితే బుర్ల వెంకట్రావుకు ఇచ్చిన పట్టాపై మాత్రం తెలుగులో సంతకం ఉంది. అలానే ఆ పట్టాపై ఉన్న శీలుకు ఆనాడు ఇచ్చిన ఇతర పట్టాలకు వేసిన శీలుకు తేడా వుంది.

1986లో తీసుకున్న డీకే పట్టాని 2024 జూన్ నెలలో మ్యూటేషన్ చేశారు. అయితే అప్పటి డికె పట్టా, గతేడాది జరిగిన మ్యూటేషన్‌లో తప్ప ఇంకెక్కడ ప్రభుత్వ రికార్డుల్లో బుర్ల వెంకట్రావు పేరు లేదు. 499-2 సర్వే నెంబరులో ఉన్న 3.42 సెంట్ల భూమిని 1995లో దగ్గుబాటి మహాలక్ష్మి అనే ఆమె ఇతరులకు అమ్మినట్లుగా ఈసీ ద్వారా తెలుస్తోంది. మరి వెంకట్రావుకి ఇచ్చిన డీకే భూమిని దగ్గుబాటి మహాలక్ష్మి వేరే వారికి ఎలా అమ్మింది. ఈ నెంబరులో ఉన్న భూమి పలు పేర్లతో ఉంది. అలానే 2011లో గ్రామ అడంగల్‌లో 499-2 సర్వేనెంబర్ భూమి ప్రభుత్వ భూమిగా రికార్డులో ఉంది. బుర్ల వెంకట్రావుకి డీకే పట్టా ఇచ్చినప్పుడు రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఎందుకు కొనసాగుతోంది. గ్రామ ఆర్.ఎస్.ఆర్ లో ఈ సర్వే నెంబరు భూమి పాండురంగాపురం గ్రామకంఠంగా చూపిస్తోంది. ఈ భూమిని బుర్ల వెంకట్రావు పేరుతో 2024 జూన్ 22న ఆన్‌లైన్‌లో మ్యూటేషన్ చేసినట్లు ఉంది. 2024 మార్చి 1 నుంచి జూలై 22వ తేదీ వరకు ఎన్నికల విధుల్లో బాపట్ల తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన ఎం.శ్రావణ్‌కుమార్ బుర్ల వెంకట్రావు పేరుతో ఆన్‌లైన్‌ల్లో మ్యూటేషన్ చేసినట్లు తెలుస్తుంది. మ్యూటేషన్ చేయడం కోసం కనీసం ప్రొసీడింగ్స్‌లో ఆర్.ఐ, డి.టి ల సంతకాలు కూడా లేకుండా కేవలం వీఆర్వో సంతకంతో తహశీల్దార్ ఎలా ఆన్‌లైన్ చేశారో అవగతం కాదు. 2024 జూన్‌లో జరిగిన ఆన్‌లైన్ మ్యూటేషన్ ప్రకారం ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ కూడా బుర్ల వెంకట్రావుకు చెందుతుంది.

స్ట్రయిట్‌కట్ కాలువ కోసం 498-1 సర్వే నెంబర్ లో 15.35 ఎకరాల భూమిని సేకరించిన నాటి అధికారులు 499 సర్వే నెంబర్‌లో ఎలాంటి భూమి సేకరించలేదు. ఎందుకు అంటే 299-2 భూమి పూర్తిగా ప్రభుత్వ భూమి, సముద్ర అలలు ఆటుపోట్లకు గురయ్యే భూమి కాబట్టి.. సముద్ర ప్రవాహం వద్ద ప్రత్యేకంగా భూమి సేకరించాల్సిన అవసరం ఏర్పడలేదు. ఎందుకు అంటే అది ప్రభుత్వ భూమి కాబట్టి. దాంతో సదరు కాలువ 498/1బి తరువాత 499-2, 500 సర్వే నంబర్లు గుండా సహజ సిద్ధంగా వంపు తిరిగి ఎల్ ఆకారంలో ప్రవహించి 501 సర్వే నంబర్ వద్ద సముద్రంలో కలుస్తుంది. సముద్రం అటుపోట్లు కారణంగా సముద్ర ప్రవాహనికి, కాలువ ప్రవాహనికి మధ్య సముద్రం నుండి బయటకు వచ్చిన ఇసుక మేట సహజ సిద్ధంగా ఏర్పడింది. ఇదే మత్స్యకారుల బోట్లు నిలుపుకునేందుకు అనువైన ప్రదేశంగా మారింది. గత 50 సంత్సరాలుగా మత్స్యకారులు ఈ కాలువను ఉపయోగించుకుంటున్నారు. ఈ భూమిలో పంటల సాగు వీలుకాదు కనుక ఆ భూమిపై అనుభవందారులుగా మత్స్యకారులు వున్నారు. ఏ పంట పండించడం సాధ్యం కాని భూమిలో భవిష్యత్తులోనైనా ఏ పంటలు పండించడం కోసం బుర్ల వెంకట్రావుకి డికె పట్టా ఇస్తారు.? అనేది ప్రశ్న.. సముద్రఅలల ఒడ్డున ఉన్న ఆ భూమి వ్యవసాయానికి ఉపయోగపడదు. మత్స్యకారుల వత్తి అవసరాలు కోసం, పడవల రాకపోకలకు మాత్రమే ఉపయోగపడుతుంది. ఈపురుపాలెం స్ట్రెయిట్ కట్ సముద్రముఖ ద్వారం (సీ మౌత్) వద్ద సర్వే నెం 499-2లో బుర్ల వెంకట్రావుకి ఇచ్చిన డీకే పట్టాన్ని రద్దు చేసి అ భూమిని మత్స్యకారుల వృత్తి అవసరాలకు కేటాయించాలని, సహజ సిద్ధంగా ఎల్ ఆకారంలో ఉన్న కాలువను పునరుద్ధరించాలని తీరప్రాంత 13 మత్స్యకార గ్రామాల కుటుంబాల వారు కోరుతున్నారు.

## కల్తీ మద్యం నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

రాష్ట్రంలో కల్తీ మద్యం పూర్తిగా నిర్మూలించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టిడిపి నియోజకరవర్గ ఇంన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. ఆదివారం యాప్ వినియోగంపై లైసెన్సుదారులు, మద్యం దుకాణ సిబ్బందికి అవగాహన కల్పిస్తూ ఆయన స్వయంగా యర్రగొండపాలెం పట్టణంలోని పుల్లలచెరువు రోడ్‌లోని మద్యం దుకాణాన్ని సందర్శించారు. అక్కడ సురక్ష యాప్ ద్వారా మద్యం సీసాలను స్కాన్ చేసి వివరాలు సరిగ్గా నమోదవుతున్నాయా లేదా అన్న విషయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో చోటు చేసుకున్న కల్తీ మద్యం ఘటనలు ప్రాణ నష్టాలకు దారితీసిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సురక్ష అనే ప్రత్యేక మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ యాప్ ద్వారా మద్యం సీసాలను స్కాన్ చేసి వాటి అసలుదనాన్ని నిర్ధారించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ శ్రీనివాసులు, ఏఎంసి చైర్మన్ చేకూరి సుబ్బారావు, టిడిపి మండల కన్వీనర్ చిట్టేల వెంగళరెడ్డి, నాయకులు చెవుల అంజయ్య, వేగినాటి శ్రీనివాస్, మంత్రునాయక్, కాకర్ల కోటయ్యతో పాటు ఎక్సైజ్ సిబ్బంది, లైసెన్సుదారులు పాల్గొన్నారు.

## భద్రతా ఏర్పాట్ల పరిశీలన తప్పనిసరి: సిఐ

**ప్రజాశక్తి-మార్కాపురం రూరల్**

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బయలుదేరడానికి ముందు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను పరిశీలించుకోవాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి సుబ్బారావు అన్నారు. కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదం నేపథ్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కోర్టు కూడలిలోని పలు ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులను మార్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ సుబ్బారావు మాట్లాడుతూ ఈ తనిఖీలు ఒక ముఖ్య ఉద్దేశం అత్యవసర తలుపులు సరిగ్గా పనిచేస్తున్నాయా? అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉన్నాయా? లేదా? బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవర్ లైసెన్సులు వంటివి పరిశీలించినట్లు తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రయాణికులు బయటపడడానికి అత్యవసరమైన భద్రతా ఏర్పాట్లు ఉన్నాయో లేదో తప్పక వాహన యజమానులు, డ్రైవర్లు సిబ్బంది చూసుకోవాలన్నారు. అదేవిధంగా ఎమర్జెన్సీ డోర్ల పనితీరును పరిశీలించాలన్నారు. అత్యవసర సమయాలలో గాజు అద్దాలను పగులగొట్టేందుకు అవసరమైన బ్రేకర్లు అందుబాటులో ఉంచాలని, లగేజీ ప్రదేశాల్లో మండే పదార్థాలు రవాణా చేయకుండా చూడాలని సూచించారు. బస్సు రిజిస్ట్రేషన్ పత్రాలు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బస్సు బయలుదేరడానికి ముందు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను పరిశీలించుకోవాలని, లేకపోతే వాహనాలను రోడ్ల మీద తిరగనిచ్చేది లేదని స్పష్టం చేశారు. సీఐ సుబ్బారావు వెంట పట్టణ ఎస్ఐ ఎం సైదుబాబు, ట్రాఫిక్ ఎస్ఐ హరోన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తుపాన్ ముప్పు తప్పదా.?

(మొదటిపేజీ తరువాయి)

బస చేస్తోంది. ఈ బృందానికి ఆర్ఎస్ఐ రామాంజనేయులు టీమ్ లీడర్‌గా వ్యవహరిస్తున్నారు. చెట్లు, ఇళ్ళు విద్యుత్ స్తంభాలు కూలితే వాటిని తొలగించే పరికరాలు, ప్రజలు నీటిలో చిక్కుకుంటే బయటకు తీసుకురావటానికి రెండు బోట్లు, డ్రాగన్ లైట్లు, కట్టర్స్, ఇతర సామాగ్రితో బృందం సిద్ధంగా ఉంది.

**స్పెషల్ ఆఫీసర్‌గా కోన శశిధర్**

తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్‌ను ప్రకాశం ప్రత్యేక అధికారిగా నియమించింది. ఆదివారం ఒంగోలు చేరుకున్న కోన శశిధర్ కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో తుపాన్ ముందస్తు జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రధాన కేంద్రాలలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్ళరాదని, ఎలాంటి విపత్తునైనా సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

# సమాచారం ఇవ్వరు.. అవగాహన కల్పించరు

**నిర్లక్ష్యంగా వెలుగు అధికారులు**

**రుణాలు అందక మహిళల ఇక్కట్లు**

**నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం**



కార్యాలయం వద్ద రుణం కోసం నిరీక్షిస్తున్న డ్వాక్రా మహిళలు

**ప్రజాశక్తి-కనిగిరి**

డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించి వారికి రుణాలు అందేలా కృషి చేసి ఆర్థికాభివృద్ధికి పాటుపడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మహిళలకు రుణాలు అందక డీఆర్‌డీఏ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మహిళా సాధికారత సాధించే దిశగా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో డ్వాక్రా గ్రూపు మహిళ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోంది. ముఖ్యమంత్రి దిశా నిర్దేశం మేరకు స్థానిక నియోజకవర్గ ప్రతినిధి ప్రయత్నం చేస్తుండగా డీఆర్‌డీఏ వెలుగు అధికారుల తీరు మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. నిర్లక్ష్య వైఖరితో క్షేత్రస్థాయిలో వ్యతిరేక ఫలితాలు వచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

కనిగిరి మండలంలో డీఆర్‌డీఏ వెలుగు శాఖ పరిధిలో 1027 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి. ఒక్కొక్క గ్రూపులో 10 నుంచి 15 మంది వరకు సభ్యులు ఉన్నారు. కనిగిరి, నందన మారెళ్ళ, బల్లిపల్లి, ఏరువారిపల్లి క్లస్టర్ల పరిధిలో ఈ గ్రూపులు ఉన్నాయి. మండల స్థాయిలో ఎపిఎం, క్లస్టర్ స్థాయిలో సిసిలు నలుగురు, స్త్రీనిధి సిసి, మండల సమాఖ్య సిసిలు ఒకరు చొప్పున ఉన్నారు. వీరితోపాటు మండల సమాఖ్య, 36 గ్రామ సమాఖ్యలు, వారి పరిధిలో 36 మది వివోఎలు విధులు నిర్వహిస్తున్నారు. ఇంతమంది ఉన్నప్పటికీ డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. కనీసం సమాచారాన్ని కూడా ఇవ్వలేకపోతున్నారంటే అధికారుల విధి నిర్వహణ, మండల సమాఖ్య, గ్రామ సమాఖ్యల, వివోఏల పనితీరు ఏ విధంగా ఉందో ఇట్టే తెలిసిపోతుంది.

**కార్యాలయాల చుట్టూ డ్వాక్రా మహిళల ప్రదక్షణ**

డిఆర్‌డిఏ వెలుగు సిబ్బంది, మండల సమైక్య, గ్రామ సమైక్య సంఘాలతోపాటు వివోఏలు ఉన్నప్పటికీ సరైన సమాచారం, అవగాహన కల్పించడంలో వైఫల్యం చెందుతూ ఉండడంతో నిత్యం డ్వాక్రా మహిళలు డిఆర్డిఏ వెలుగు కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు వచ్చే చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. రుణాల కోసం, ప్రభుత్వ పథకాల కోసం బ్యాంకుల చుట్టూ, కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. కొంతమంది సిబ్బందిని ప్రశ్నిస్తూ నిలదీసే పరిస్థితి నెలకొంటోంది. మరి కొంతమంది ఎక్కడ ఇబ్బంది పెడతారో అని మిన్నకుండిపోతూ లోలోపల మదన పడుతున్నారు. మండలంలోని పునుగోడు గ్రామానికి చెందిన ఒక గ్రూపు సభ్యులు శుక్రవారం కార్యాలయానికి వచ్చి వెలుగు సిబ్బందిని నిలదీయడం అందుకు నిదర్శనం. బ్యాంకర్లు రుణాలు ఇస్తాము తీసుకోండి అని చెబుతుండగా వెలుగు సిబ్బంది, వివోఏలు, మండల స్థాయి అధికారి నిర్లక్ష్య వైఖరి సమన్వయ లోపం కారణంగా రుణాలు పొందటంలో జాప్యం జరుగుతూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. వెలుగు శాఖ నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి, నియోజకవర్గ నేతకు చెడ్డ పేరు వచ్చే పరిస్థితి ఉందని గ్రామాలలో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నత అధికారులు, పాలకులు చొరవ చూపి డిఆర్‌డిఏ వెలుగు శాఖ అధికారులు, సిబ్బంది పనితీరులో మార్పు వచ్చేలా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కూతురిపై తండ్రి అఘాయిత్యం

**ప్రజాశక్తి-కొండపి**

కూతురిపై తండ్రి అత్యాచారం చేసిన సంఘటన కొండపి మండలంలో ఓ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం గత కొన్ని రోజుల క్రితం ఓ గ్రామానికి చెందిన పదకొండేళ్ల బాలిక ప్రవర్తనలో మార్పు రావడానికి గమనించిన తల్లి ఒంగోలులోని ఓ వైద్యశాలలో చూపించగా అఘాయిత్యం జరిగినట్లు నిర్ధారణ అయింది. బాలికను గట్టిగా నిలదీయడంతో అసలు విషయం బయట పెట్టింది. తండ్రే తనమీద అఘాయిత్యానికి పాల్పడ్డాడని తెలపడంతో ఒక్కసారిగా ఆ తల్లి షాక్‌కు గురైంది. చిన్నారిని తీసుకొని పోలీసులను ఆశ్రయించింది.

## చెరువులో పడి వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-టంగుటూరు**



మృతి చెందిన సుందరయ్య

పశువులు మేపుకోవడానికి వెళ్లి కాలు జారి నీటికుంటలో పడి వ్యక్తి మృతి చెందిన నంఘటన టంగుటూరు మండలం ఆలకూరపాడులో శనివారం చోటు చేసుకుంది. ఆలకూరపాడు గ్రామానికి చెందిన దివి సుందరయ్య(54) శనివారం గేదెల మేపుకోవడానికి అనంతవరం గ్రామ వెళ్లే పొలాల వైపు వెళ్లి, పెంటాయి కుంటలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు కాగా అన్న దివి వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు టంగుటూరు యస్ఐ వి.నాగమల్లీశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సుబ్బారాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాలడుగు

## ఎన్‌ఆర్‌ఐని కలిసిన 'పాలడగు'

**ప్రజాశక్తి-నాగులుప్పలపాడు**

మద్దిరాలపాడు గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు నెప్పల సుబ్బారాయుడును అదే గ్రామానికి చెందిన వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో స్నేహపూర్వకంగా మాట్లాడి గ్రామ అభివృద్ధి, ఎన్‌ఆర్‌ఐ చేసిన సేవలను కొనియాడారు. గ్రామాభివృద్ధికి మరిన్ని సేవలందించాలన్నారు. ఎన్‌ఆర్‌ఐ సుబ్బారాయుడు గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుదన్నారు. ఈ కార్యక్రమంలో పాలడగు సందీప్, వైసీపీ సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీ స్వర్ణ అనిల్, దాసరి తిరుపతి స్వామి, స్వర్ణ అనిల్, స్వర్ణ వినయ్, కాటూరి రాకాని, మాడుగుల అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి స్వామిని కలిసిన న్యాయవాదులు

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

శింగరాయకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో శింగరాయకొండ న్యాయవాదులు ఆదివారం మంత్రి స్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శింగరాయకొండ జూనియర్ సివిల్ జడ్జి నూతన కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న యువ న్యాయవాదులు, మహిళా న్యాయ వాదులను మంత్రి డాక్టర్ స్వామికి పరిచయం చేశారు. శింగరాయకొండలో నూతన కోర్టు ఏర్పాటుకు సహకరించినందుకు మంత్రి డాక్టర్ స్వామికి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు. శింగరాయకొండ కోర్టులో ఉన్న న్యాయవాదులతో వారి సమస్యల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బక్కమంతుల వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ పాలవెల్లి సంజీవ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు తాళ్లూరి వెంకటేశ్వర్లు, కె.హరి కోటేశ్వర రావు, రాఘవేంద్ర రావు, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



మంత్రి స్వామిని సన్మానిస్తున్న న్యాయవాదులు

## భైరవకోనకు భక్తులెవరూ రావొద్దు

**సిఐ ఎం.భీమా నాయక్**

**ప్రజాశక్తి-సిఎస్‌పురం**

మండలంలోని భైరవకోనకు తుఫాను కారణంగా భక్తులు, పర్యాటకులు రావొద్దని పామూరు సిఐ ఎం.భీమా నాయక్ సూచించారు. వాతావరణశాఖ జారీ చేసిన మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో సిఐ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భైరవకోనకు వచ్చే దారిలో కల్వర్టు వద్ద నీరు అధికంగా ప్రవహిస్తుదన్నారు. జల పాతం, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు ఎవరూ స్నానం కోసం దిగవద్దని కోరారు.



సిఐ భీమా నాయక్

## రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఆలకూరపాడు విద్యార్థి

**ప్రజాశక్తి-టంగుటూరు**



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రకాశం జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ పోటీలలో అండర్-17 బాలికల విభాగంలో ఆలకూరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ రెహెనాభాను ఎంపికైనట్లు హెచ్ఎం వాకా వెంకటేశ్వర్లు తెలిపారు. కొత్తపట్నం మండలం, గమండ్ల పాలెం ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన పోటీలలో రెహెనాభాను సత్తా చాటారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి 69వ స్కూల్ గేమ్స్ పోటీలలో ప్రకాశం జిల్లా జట్టు నుంచి పాల్గొంటుందని పాఠశాల పిడి పి.వెంకటరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థినికి పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ చప్పిడి పున్నయ్య చౌదరి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



వీరయ్య చౌదరి సతీమణి సుచిత్రతో మాట్లాడుతున్న రాష్ట్ర శాప్ చైర్మన్ రవినాయుడు

## వీరయ్య చౌదరి కుటుంబానికి టీడీపీ నాయకుల పరామర్శ


**ప్రజాశక్తి-నాగులుప్పలపాడు**

నాగులుప్పలపాడు మండల మాజీ ఎంపిపి ముప్పవరపు వీరయ్య చౌదరి హత్యకు గురైన సంఘటన విదితమే. వీరయ్య కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, నారా ప్రశాంత్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా సుచిత్ర వీరయ్య చౌదరితో రవి నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ వీరయ్య చౌదరి సేవలను మర్చిపోదన్నారు. మీ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. భవిష్యత్తులో సుచిత్రకు పార్టీ మంచి భవిష్యత్తు ప్రణాళిక సిద్ధం చేసినట్లు రవి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగులుప్పలపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్, నియోజకవర్గ రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, మెట్టు సుబ్బయ్య పాల్గొన్నారు.

# వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

**ప్రజాశక్తి-సీఎస్‌పురం రూరల్**

రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసి పేదలకు వైద్యం, విద్య అందకుండా చేయాలన్న సీఎం చంద్రబాబు కుతంత్రాలను అడ్డుకోవాలని వైసిపి మండల అధ్యక్షుడు పాలుగుళ్ళ మల్లికార్జున రెడ్డి, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డిలు అన్నారు. మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వైసీపీ మండల అధ్యక్షుడు పాలుగుళ్ల మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఆనికాలపల్లి గ్రామంలో నిర్వహించారు. ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో వైసీపీ మండల అధ్యక్షుడు పాలుగుళ్ళ మల్లికార్జున రెడ్డి, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్ రెడ్డి, అనికాలపల్లి సర్పంచ్ చెరుకుపల్లి రాధా కృష్ణా రెడ్డి, వైయస్ఆర్ టీయుసి జిల్లా అధ్యక్షుడు మితికేల గురవయ్య, మాజీ ఎంపీపీ భువనగిరి వెంకటయ్య, ఎంపీటీసీ లు బైరెడ్డి తిరుపతిరెడ్డి, మన్నెపల్లి పెద్దన్న, బత్తుల దేవరాజు, బండి పద్మ నాభం పాల్గొన్నారు.



సిఎస్‌పురంలో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

**శింగరాయకొండ :** మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయటం తగదని వైసీపీ నాయకులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని సుందర్ నగర్‌లో చేపడుతున్న కోటి సంతకాల సేకరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి నుంచి జగన్మోహన్ రెడ్డి వరకు మెడికల్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు పేదలకు మెడికల్ సీట్లు వచ్చే విధంగా చేయడం జరిగిందన్నారు. మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో మూలగుంటపాడు గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు షేక్ కరీమ్, షేక్ నౌషాద్, పాలూరి శ్రీనివాసులరెడ్డి తదితరులు ఉన్నారు.



శింగరాయకొండలో సంతకాలు సేకరిస్తున్న అశోక్ కుమార్‌రెడ్డి

**తాళ్ళూరు:** కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం అన్యాయమని తాళ్లూరు మాజీ ఎంపీపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదనరెడ్డి అన్నారు. మండలంలోని బెల్లం కొండవారిపాలెంలో పోశం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా సంతకాల సేకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం యొక్క తీరును ఆయన ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూడా శ్రీనివాసరెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం

## ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి - రేపల్లె**

స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ కమిటీ ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎం సూర్య ప్రకాష్ తెలిపారు. గతంలో కార్యవర్గ సభ్యులుగా ఉన్న కార్యకర్తల చదువు పూర్తవటంతో తిరిగి నూతన కమిటీ ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యదర్శిగా ఎం సూర్యప్రకాష్, సహాయ కార్యదర్శి వై నవీన్, గర్ల్స్ కన్వీనర్ పి హేమనాగ శ్రీ కొనసాగిస్తూ నూతనంగా అద్యక్షుడు జి కళ్యాణ్‌తోపాటు మరో 9మందిని ఎన్నుకున్నట్లు తెలిపారు. సహాయ కార్యదర్శిలు బి జాన్సన్ బాబు, వి వంశీ గోవర్ధనరాజు, పి సుమంత్, కె సంజయ్, ఉపాధ్యక్షులు కె సుబ్రమణ్యం, ఎం అరుణ ప్రసాద్, పి సుమంత్, గర్ల్స్ కో కన్వీనర్ కె భవానీ ఎన్నికైనట్లు తెలిపారు.



డాక్టరేట్ అందుకుంటున్న కొండపల్లి వెంకయ్య

## ఆయుర్వేద వైద్యుడికి డాక్టరేట్

**ప్రజాశక్తి - మార్టూరు రూరల్**

ఆయుర్వేద వైద్యుడు కొండపల్లి వెంకయ్యకు అరుదైన పురస్కారం లభించింది. ఎపి కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా చైర్మన్‌గా, స్టేట్ ఎగ్జిట్ నెంబర్‌గా, ఎపి దేశీయ వైద్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా, సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పనిచేస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు తమిళనాడులోని అమెరికన్ విజ్ డమ్ పీస్ యూనివర్సిటీ హొసూర్‌లో గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అమెరికన్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. సమాజసేవ చేయడానికి మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. ఆయన గౌరవ డాక్టరేట్ అందుకోవటం పట్ల రాజుగారిపాలెం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేశాం

**ప్రజాశక్తి - బాపట్ల**



డాక్టర్ ఎస్ విజయమ్మ

మొంథా తుపాన్ ప్రభావం దృష్ట్యా జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని అప్రమత్తం చేశామని వైద్య ఆరోగ్య జిల్లా అధికారి ఎస్ విజయమ్మ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరోగ్య శాఖ పూర్తి స్థాయి సన్నద్ధత చర్యలు చేపట్టిందని అన్నారు. తుపాను తీవ్రత దృష్ట్యా తీర ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలు ఏర్పాటు చేశామని అన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పిహెచ్‌సిల్లో అత్యవసర చికిత్సా పరికరాలు, ఔషధాలు, పాముకాటు మందులు, ఒఆర్ఎస్ ద్రావణాలు, ప్రథమ చికిత్స సామగ్రి సమృద్ధిగా నిల్వ ఉంచామని అన్నారు. అవసరమైతే తుపాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు తక్షణ వైద్యం అందించేందుకు మొబైల్ మెడికల్ టీంలు సిద్ధం చేసామని అన్నారు. వ్యాధుల వ్యాప్తి నివారణకు డిసీజ్ కంట్రోల్ టీంల ఏర్పాటుతోపాటు అన్ని ఆసుపత్రుల్లో 24 గంటలు విధుల్లో ఉండాలని వైద్య అధికారులను ఆదేశించామని అన్నారు. వర్షపు నీరు కలిసిన తాగునీటిని వినియోగించరాదని అన్నారు. అనారోగ్య లక్షణాలు కనపడిన వెంటనే పునరావాస కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు, లేక సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కంట్రోల్ రూం ద్వారా 24 గంటలు వైద్య సహాయం సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 08643 293668లో సంప్రదించాలని అన్నారు.

# అబ్దుల్ కలాం పురస్కారం అందజేత

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**



పురష్కారం అందజేస్తున్న కెఎస్ లక్ష్మణరావు

విద్యా, పరిశోధన రంగాల్లో విశిష్ట సేవలు అందించిన అక్క, తమ్ముడు డాక్టర్ బిట్రా భాను శంకర్, బిట్రా జయంతికి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జాతీయ పురస్కారం మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ డాక్టర్ బిట్రా భాను శంకర్ బహుముఖ ప్రతిభ కలిగి స్వతంత్ర శాస్త్రవేత్తగా విస్తృత పరిశోధనలతో విద్యార్థులు, పరిశోధకులు, స్కాలర్స్‌కు మార్గనిర్దేశం చేశారని అభినందించారు. ఆయన చేనేత వృత్తి నుండి వచ్చి సమాజానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. డాక్టర్ బిట్రా భాను శంకర్ గతంలో నగరంలోని ఎస్‌విఆర్‌ఎం డిగ్రీ కాలేజిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారని అన్నారు. ఆయన అంతర్జాతీయ జర్నల్స్‌లో అనేక పరిశోధన పత్రాలు ప్రచురించినట్లు తెలిపారు. 2025లో ఉత్తమ పరిశోధకుడు (బెస్ట్ రీసెర్చ్ అవార్డు) అందుకున్నారని వివరించారు. డాక్టర్ కలాం ఆలోచనల ప్రేరణతో విద్య, పరిశోధన, సేవా కార్యక్రమాలతో సమాజ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని పురస్కార గ్రహీతలు పేర్కొన్నారు. ఈ గౌరవం తమ బాధ్యత మరింత పెంచుతుందని అన్నారు.

# తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి - రేపల్లె**



డిఎస్‌పి శ్రీనివాసరావు

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయు గుండం తీవ్రమై అక్టోబర్ 28 నాటికి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిఎస్పి ఆవుల శ్రీనివాసరావు అన్నారు. మొంథా తుఫాన్ దృష్ట్యా నిజాంపట్నం, దిండి, పరిశావారి పాలెం, నక్షత్ర నగర్ బీచ్‌లలో కార్తీకమాసం సముద్ర స్నానాలు తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు. 27, 29తేదీల్లో తుఫాను తీవ్రత ఉంటుందని అన్నారు. ఆస్థి, ప్రాణ నష్టం జరగకుండా పోలీసు యంత్రాంగం పూర్తి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

# జిల్లా పారిశ్రామికాభివృద్ధికి కృషి

**• నూతన పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు • వై రామకృష్ణ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి**

**ప్రజాశక్తి- బాపట్ల జిల్లా**



వై రామకృష్ణ, పరిశ్రమల అధికారి

ముఖాముఖి

**బాపట్ల జిల్లా ప్రారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు దశల వారీ ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వై రామకృష్ణ తెలిపారు. జిల్లా ఆర్థికాభివృద్ధికి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తోడ్పాటు అందిస్తూ పలు పరిశ్రమల ఏర్పాటుకు తమ వంతు కృషిచేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా తయారీ రంగం, సేవా రంగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పరిశ్రమల శాఖ ద్వారా చేపట్టిన, చేపట్టనున్న పలు ప్రాజెక్టుల గురించి ఆయన 'ప్రజాశక్తి'కి ముఖాముఖి వివరించారు.**

పారిశ్రామిక వాడగా జిల్లాను మార్చడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్క్ (ఎమ్ఎస్ఎమ్ఇ) ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాపట్లలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఇది అందుబాటులోకి వస్తే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా ఉంటుంది. చీరాల ఆటోనగర్లో పలు రకాల పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు. రేపల్లె నియోజకవర్గం నిజాం పట్నంలో 3.90 ఎకరాల్లో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. పర్చూరు నియోజ కవర్గంలోని నాగరాజుపల్లెలో 50 ఎకరాల్లో ఫుడ్ పార్కు ఏర్పాటుకు కావలసిన మౌళిక సదుపాయాలు కల్పించారు. మేదరమెట్ల వద్ద రూ.225 కోట్ల అంచనా లతో శర్వాణి బయెఫ్యూయెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎథనాల్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తుంది. అద్దంకిలో మెటల్ డోర్స్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రాజెక్టు ఉంది. వేమూరు నియోజకవర్గం జంపని వద్ద అరటి బోదెలు, పట్టు పురుగుల వ్యర్థాలతో వస్త్రాల తయారీ కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఉపాధి కల్పన (పిఎంఇజిపి) పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా కొత్తగా సూక్ష్మ పరిశ్ర మలు స్థాపించడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. స్వశక్తి తో నిలబ డాలనుకునే నిరుద్యోగులకు ఈ పథ కం ద్వారా రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు రుణాన్ని ఇస్తారు. ఇందు కోసం ఇచ్చే రుణంపై కేంద్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ లభిస్తుంది. ఇది ప్రాజెక్ట్ వ్యయంలో 15 శాతం నుండి 35 శాతం వరకు ఉంటుంది. సిమెంట్, ఫ్లెయాష్ బ్రిక్స్, సిమెంట్ డోర్లు, పార్కింగ్ టైల్స్, రైస్ మిల్లులు, డాల్ మిల్లులు, జీడిపప్పు ప్రాసెసింగ్, వ్యవసాయ, ఆహార ఆధారిత పరిశ్ర మల ఏర్పాటుకు రుణం ఇస్తారు. సేవా రంగంలో రూ.20 లక్షల వరకు రుణం ఇస్తారు. సెట్రింగ్ మెటీరి యల్, డిజె సౌండ్ సిస్టమ్, టెంట్ హౌస్లు, ఎయిర్ కంప్రెసర్లు, లేడీస్ బ్యూటీ పార్లర్ ఏర్పాటుకు రుణాలు ఇస్తారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి జీవనోపాధి (పీఎంఎఫ్ఎంఈ) పథకం ద్వారా రుణాలు ఇస్తున్నారు. ప్రాజెక్టు ఖర్చులో 35 శాతం వరకు గరిష్టంగా రూ.10 లక్షలు వరకు సబ్సిడీ లభిస్తుంది. జిల్లాలో ఈపథకం ద్వారా పలు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. పిఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ, వాటిని శుద్ధిచేసి ఉపయోగకరమైన ఉత్పత్తులుగా తయారు చేసి వ్యాపారం చేయవచ్చు. జిల్లాను పారిశ్రామిక రంగంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు జిల్లాలో పరిశ్రమల కోసం 202 దరఖాస్తులు చేసుకోగా జిల్లా కమిటీ పరిశీలించి దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో ఏర్పాటైన 186 పరిశ్రమలకు రూ.5.72 కోట్ల రాయితీ సొమ్ము ఈ ఏడాది ప్రథమార్ధంలో మంజూరైంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను నెలకొల్పే చర్యల్లో బాగంగా పరిశ్రమల స్థాపనకు దరఖాస్తులు దాఖలు చేసుకున్న వారికి స్థలాల కేటాయింపుల కోసం చర్యలు తీసుకుంటున్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కెవిఐసి) రాష్ట్ర ఖాదీ, గ్రామ పరిశ్రమల బోర్డు (కెవిఐబి) ద్వారా జిల్లాలో ఉపాధి అవకాశాల కోసం నిరుద్యోగ యువత ధరఖాస్తు చేసుకోవచ్చు. స్వయం సహాయక బృందాల వారు తాము పొందిన రుణాలతో పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే ఉద్యమ రిజిస్ట్రేషన్ వర్కుషాపులో పాల్గొని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పి శ్రీకాంత్

## ఉచిత షుగర్ వైద్యశిబిరానికి విశేష స్పందన

**ప్రజాశక్తి - చీరాల**

మండలంలోని వాడరేవు శ్రీశ్రీశ్రీ రామానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమం ఆవరణలో షుగరు వ్యాధికి ఉచిత వైద్య శిభిరం ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వర్షంను సైతం లెక్క చేయకుండా వేకువ జాము నుండే వచ్చిన 1224 మందికి నెల రోజులకు సరిపడు మందులు ఉచితంగా అందజేసినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. శిభిరానికి హాజరైన వారందరికి అల్పాహారం, తాగునీరు, ఇతర సహాయక ఏర్పాట్లు చేశారు. షుగర్ వ్యాధి బాధితులు వర్షం కారణంగా వేచి ఉండ కుండా వేగంగా వైద్య పరీక్షలు చేసేందుకు అవసరమైన విస్తృత ఏర్పాట్లతో వచ్చిన వారందరికీ మందులు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా షుగరు వ్యాధిపై రోగులకు వైద్యులు అవగాహన కల్పించారు. రోజువారీ జీవన విధానం మార్చుకోవాలని వైద్యులు చెప్పారు. ఆహారపు అలవాట్లు మార్చుకుంటే షుగర్ నియంత్రణలో ఉంటుందని చెప్పారు. మానసిక ఆందోళన తగ్గించుకోవాలని చెప్పారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వ్యాయామం, నడక అలవాటు చేసుకోవాలని చెప్పారు. వాడరేవు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, చీరాల మహిళా కళాశాల విద్యార్థులు రోగులకు ఆహారం, తాగునీటి వసతులు, సహాయక ఏర్పాట్లు చేశారు. ఈ వైద్య శిభిరంలో డాక్టర్ ఎం రాజరాజేశ్వరి, డాక్టర్ కమలా రాజేశ్వరి, డాక్టర్ లలిత్ ప్రకాష్, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ ప్రకాష్ వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, సాయి ఫణికిషోర్, చందన, కామేశ్వరరావు, ఎంజి శంకరరావు, బసవరావు, కుమార్, కె లింగరాజు, మోహన్, మిత్ర ల్యాబ్ వలి, గోపాల్ పాల్గొన్నారు.

## డిప్యూటీ ఎంపిడిఒగా నిరంజనరావు

**ప్రజాశక్తి - కొల్లూరు**



ఎస్ నిరంజనరావు

డిప్యూటి ఎంపిడిఒగా ఎస్ నిరంజనరావు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన గతంలో గుంటూరు జెడ్‌పి డిపిఆర్‌సి విభాగం నందు పనిచేస్తూ పదోన్నతపై కొల్లూరుకు బదిలీ అయ్యారు.



పుస్తక పఠనంలో మాట్లాడుతున్న మన్నం త్రిమూర్తులు

## పుస్తక పఠనం అవసరం

**ప్రజాశక్తి - అద్దంకి**

గ్రంథాలయం ఉద్యమంలో భాగంగా పుస్తక పఠనంలో విద్యార్థులు, పెద్దలు 50మందిపైగా పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీ కమిటేస్వర స్వామి దేవాలయం నందు బాల, బాలికలు దినపత్రికలు, చెకుముకి మ్యాగజైన్స్, నీతి కథల పుస్తకాలు చదివారు. వాటిలోని నీతి వాక్యములు చదివి వినిపించారు. పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ పుస్తక పఠనం జ్ఞాన అభివృద్ధి తోపాటు ఏకాగ్రత మెరుగవుతుందని తెలిపారు. మనసుకు ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. విశ్రాంత గ్రంథ పాలకుడు సిహెచ్ సుగుణరావు మాట్లాడుతూ ఒక మంచి పుస్తకం 100 మంది స్నేహితులతో సమానమని అన్నారు. చిన్నప్పటి నుంచి పుస్తక పఠణం ఎంతో మంచి భవిష్యత్తు ఇస్తుందని అన్నారు. సెల్‌పోన్ల యుగంలో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్షులు కావూరి రఘు చంద్, తంగా శ్రీనివాసరావు, జ్యోతి రమేష్, ఎర్రయ్య, రమేష్ పాల్గొన్నారు.



ప్రత్యేక అధికారి వేణుగోపాల్‌రెడ్డితో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

## బాపట్ల ప్రత్యేక అధికారిగా వేణుగోపాల్‌రెడ్డి

**ప్రజాశక్తి- బాపట్ల జిల్లా**

తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం బాపట్ల జిల్లాకు ప్రత్యేక అధికారిగా ఎం.వేణుగోపాల్‌రెడ్డి నియమించబడ్డారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో ఆయనను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, సంయుక్త కలెక్టర్ భావన, ఎస్పీ ఉమామహేశ్వర్ స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో తుఫాన్ ప్రభావం నేపథ్యంలో జిల్లా యంత్రాంగం తీసుకున్న ముందస్తు చర్యల గురించి వివరించారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

డి3 పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముంగమూరు రోడ్డు, జెడ్ పి కాలనీ, కొత్త డొంక, జర్నలిస్ట్ కాలనీ, సుబ్బయ్య నగర్, మర్రిచెట్టు కాలనీ, ప్రగతి నగర్, గాంధీనగర్ ఎక్స్‌టెన్షన్, మర్రిచెట్ల కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని టౌన్ డిఇఇ పాండురంగారావు తెలియజేశారు.

# పుకార్లు నమ్మొద్దు..అప్రమత్తంగా ఉండండి..

### కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

బాపట్ల జిల్లా పరిధిలో మొంథా తుపాను కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా నివారించే ఉద్దేశంతో జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఇతర విద్యాసంస్థలు అన్నింటికీ 27, 28, 29 తేదీల్లో సెలవులు ప్రకటించినట్లు కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. ప్రజలు సోషల్ మీడియా ద్వారా వచ్చే పుకార్లను నమ్మవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజల భద్రతకు సంబంధించి పలు సూచనలు చేశారు. అధికారిక సమాచారం కోసం మొబైల్ ఫోన్‌ను ఛార్జ్ చేసి ఉంచుకోవాలన్నారు. అత్యవసర హెచ్చరికల కోసం ఎస్ఎంఎస్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, వారి సూచనలను తప్పనిసరిగా పాటించాలని



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు వెళ్లవద్దని, వాహన ప్రయాణాలు చేయవద్దని సూచించారు. ఇంటి విద్యుత్ ప్రధాన స్విచ్‌ను ఆఫ్ చేసి, ఎలక్ట్రిక్ ఉపకరణాలను ప్లగ్ నుంచి తీసేయాలని, తెగిపోయిన తీగలు, స్తంభాలను తాకరాదని హెచ్చరించారు. పాత భవనాలు, చెట్లు, విద్యుత్ వైర్లు వంటి ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. శుభ్రమైన తాగునీరు, చెడిపోని ఆహారం, మందులు, టార్చ్, బ్యాటరీలు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, ముఖ్య పత్రాలు వంటి అత్యవసర కిట్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. మత్స్యకారులు సముద్రం లేదా వాగుల్లో చేపల వేటకు వెళ్లకూడదని, సహాయం అవసరమైతే జిల్లా కంట్రోల్ రూమ్ 08643-220226 నంబర్‌కి సంప్రదించాలని సూచించారు. పశువులు, పెంపుడు జంతువులకు కట్టిన తాడును విప్పి వదిలివేయాలని, విలువైన వస్తువులు, పత్రాలను వాటర్ ప్రూఫ్ కంటైనర్‌లో ఉంచాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు జాగ్రత్తగా ఉండాలని, సమీప పీహెచ్‌సీలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

# జాతీయ రహదారిపైకి వర్షపు నీరు

- పొంగిన పెళ్లూరు చెరువు అలుగు
- పరిశీలించిన ఆర్డీవో, కమిషనర్, ఇరిగేషన్ ఎస్ఇ



జాతీయ రహదారిపైకి వచ్చిన నీరు

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెళ్ళూరు చెరువు అలుగు పొంగటంతో జాతీయ రహదారిపైకి వర్షపు నీరు చేరింది. కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, ఇరిగేషన్ ఎస్ఇ వరలక్ష్మి, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు స్థానికులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కాల్వలు



పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న, కమిషనర్ వెంకటేశ్వరరావు

చిన్నగా ఉండటంతో వర్షపు నీరు జాతీయ రహదారిపైకి చేరింది. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు జేసీబీల ద్వారా అడ్డంకులు తొలగించి.. ఇబ్బందులు లేకుండా నీటిని పంపే ఏర్పాట్లు చేశారు. కాల్వలు పెద్దవి చేయాలని కలెక్టర్ హైవే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఒంగోలు తహశీల్దార్ పి.మధుసూదనరావు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బందికి సెలవులు రద్దు..

### తాలూకా సిఐ విజయకృష్ణ

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

తుపాన్ తీవ్రతను ఎదుర్కొనేందుకు పోలీసు సిబ్బందికి సెలవులు రద్దు చేసి.. అందరినీ అందుబాటులో ఉంచినట్లు తాలూకా సిఐ విజయకృష్ణ తెలిపారు. తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొంథా తుపాను ప్రభావం కారణంగా ప్రజలందరూ ఎమర్జెన్సీ అయితే తప్ప ఎటువంటి ప్రయాణాలు పెట్టుకోవద్దన్నారు. కార్తీకమాసం పవిత్ర స్నానాలు ఆచరించే భక్తులు సముద్ర స్నానాలకు వెళ్ళవద్దని సూచించారు. సముద్ర తీర ప్రాంతాల్లో అవాంఛనీయ సంగటనలు జరిగినప్పుడు ప్రజలను కాపాడటానికి గజ ఈతగాళ్లని ఉంచామన్నారు. తుపాను తీవ్రతకు చెట్లు పడిపోవడం, రోడ్లు కోతకు గురికావడం వంటివి సంభవిస్తే సత్వరమే స్పందించి, వాటిని సత్వరమే పునరుద్ధరించటానికి కార్పొరేషన్ అధికారుల సమన్వయంతో తగు జాగ్రత్తలు తీసుకుంటామని సిఐ విజయకృష్ణ తెలిపారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

ఒంగోలు సెయింట్ థెరిస్సా హైస్కూల్ 1978 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థుల పరిచయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అంజయ్య రోడ్ లోని బీసీ భవన్‌లో జరిగిన



సేవా కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు

కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ విద్యాసంస్థలో కలసి చదివిన మిత్రులు ఇప్పుడు వివిధ వత్తుల్లో ఉన్నప్పటికీ, చిన్ననాటి జ్ఞాపకాలను మళ్లీ గుర్తుచేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. సమాజానికి మేలు చేయాలనే భావనతో మ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందించే దిశగా అందరం ముందుకు సాగాలి అని అన్నారు. కార్యక్రమం అనంతరం పూర్వ విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఒంగోలు హౌసింగ్ బోర్డులోని బొమ్మరిల్లు చిన్నారుల ఆశ్రమంలో, సంతపేట శివం వద్దుల శరణాలయంలో విద్యార్థులకు పండ్లు, కాయలు మరియు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పసుపులేటి నరసింహారావు, కత్తినేని సుబ్బారెడ్డి, పెళ్లూరు వెంకట సుబ్బారావు, ఎడ్ల కష్ణారెడ్డి, గుజ్జల గురవారెడ్డి, పఠాన్ గఫర్ ఖాన్, డేవిడ్‌రాజు, జవహర్, తోట ప్రసాద్‌రావు, కోడెల కోటయ్య, బత్తుల నాగేశ్వరరావు, గజ్జల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు

# టెట్ మినహాయింపు ఇవ్వాలి

### యుటిఎఫ్ డిమాండ్

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

ఇప్పటికే ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష తప్పనిసరి చేయడం అన్యాయమని, వారికి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఆ మేరకు ఆదివారం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై, ప్రధాన కార్యదర్శి డి. వీరాంజనేయులు సంయుక్తంగా ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తాజా తీర్పు ప్రకారం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ విధించడం సరైనది కాదని అన్నారు. 20 నుండి 30 సంవత్సరాలుగా సేవలందిస్తున్న సీనియర్ టీచర్లు అప్పట్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం శిక్షణ పొందినవారేనని, పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు పొందారని గుర్తు చేశారు. ఆర్‌టిఈ చట్టం 2009లో ఆమోదం పొందగా, 2010 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వచ్చిందని, అందుకుముందు నియామకం పొందిన ఉపాధ్యాయులకు ఆ చట్టాన్ని ప్రతిపాదించడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ఏళ్ల తరబడి బోధన అనుభవం, వత్తి పట్ల అంకితభావం, తరగతి గదిలో ప్రాక్టికల్ పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాన్ని టెట్ పరీక్షలతో కొలవడం తగదు అని వ్యాఖ్యానించారు.ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ శిక్షణల ద్వారా ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను పెంపొందిస్తున్నారని, విద్యార్థుల స్థాయికి తగ్గట్టు బోధించడం సీనియర్ ఉపాధ్యాయుల ప్రత్యేకతగా ఉందని వివరించారు. మళ్లీ టెట్ పరీక్ష పేరుతో వారిని మానసిక ఒత్తిడికి గురి చేయడం, విద్యా బోధన సమయాన్ని వథా చేయడమే తప్ప మరే ప్రయోజనం ఉండదని హితవు పలికారు.

తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలు ఇప్పటికే ఈ విషయంలో సానుకూల వైఖరి చూపినట్టు గుర్తు చేస్తూ, జాతీయ స్థాయిలో ఎస్‌టీఎఫ్ఐ (స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందని వివరించారు. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే దిశగా ముందడుగు వేయాలని, ఆర్‌టిఈ చట్టం సెక్షన్ 23(2)లో సవరణ చేసేందుకు ఉభయసభల ఆమోదంతో బిల్లును సుప్రీంకోర్టుకు సమర్పించాల్సిందిగా కోరారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ చూపి, కేంద్ర మానవ వనరుల అభివద్ధి మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో చర్చించి, సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కల్పించేలా చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

## వేణుగోపాల్‌కు రైతునేస్తం పురస్కారం

**ప్రజాశక్తి-ముండ్లమూరు**

నర్సరీ రంగంలో ఆధునిక విధానాలు అవలంబిస్తున్నందున ముండ్లమూరులోని శ్రీ సాయిబాబా వెజిటబుల్ నర్సరీ అధినేత నల్లబోతు వేణుగోపాల్ రైతునేస్తం పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం శంషాబాద్ దగ్గర ముచ్చింతల్‌లో ఉన్నటువంటి స్వర్ణభారతి ట్రస్ట్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ద్వారా వేణుగోపాల్ అందుకున్నారు. వేణుగోపాల్‌ను వారు ఘనంగా సత్కరించారు.



పురస్కారం అందుకుంటున్న వేణుగోపాల్

# తుపాన్ పట్ల అప్రమత్తంగా ఉండండి

**ప్రజాశక్తి - రేపల్లె**

మొంథా తుఫాన్ ప్రభావం ఎక్కువుగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఎస్టీ కాలని ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సోమవారం ఉదయం నుండి తుఫాన్ ప్రభావం ఉంటుందని తెలిపారు. సచివాలయాల పరిధిలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిశీలించారు. ఎస్‌టి కాలనీకి డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ ఎన్ రామలక్ష్మి, డిఎస్పి ఆవుల శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, తహశీల్దారు, ఎంపిడిఓ ఉన్నారు.

**బట్టిప్రోలు :** మొంథా తుఫాను ఎదుర్కొనే చర్యలపై డిప్యూటీ కలెక్టర్ ఎం నాగిరెడ్డి స్థానిక తహశీల్దారు ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రత్యేక అధికారి డాక్టర్ బి వేణుగోపాల్, ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, ఎస్‌హెచ్‌ఒ ఎం శివయ్య మాట్లాడారు. కంట్రోల్ రూం 81798 86300కు సమస్య ఉంటే తెలుపాలని కోరారు.

**ఇంకొల్లు :** మొంథా తుఫాన్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో తహశీల్దారు శ్రీనివాసరావు, ఎంపిడిఒ జి శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. అధికారులు అందరూ అందుబాటులో ఉండాలని అన్నారు. ఎపిఎం, పిఆర్‌డిఇ, ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణి, ఎంఓ రాజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

**పంగులూరు :** మొంతా తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేణింగవరం ఎస్‌ఐ వినోద్ బాబు కోరారు. తుఫాను తీవ్రంగా రాబోతుందని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారని తెలిపారు.

**వేటపాలెం :** మండలంలోని చల్లారెడ్డిపాలెం, కటారివారిపాలెం గ్రామాలను ఎస్‌ఐ పి జనార్ధన్ ఆదివారం సందర్శించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. తీవ్రమైన గాలులు, భారీ వర్షాల కారణంగా ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# మూడు రోజులు విద్యాసంస్థలకు సెలవు

**ప్రజాశక్తి - రేపల్లె**

మొంథ తుఫాను తీవ్రతను ధృష్టిలో వుంచుకొని ఈ నెల 27, 28, 29 వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు ఆర్డీఒ ఎన్ రామలక్ష్మి అన్నారు. ఆర్‌డిఒ, తహశీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచాయతీ నుంచి మండల, జిల్లా స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు.

**ఇంకొల్లు :** తుఫాను ప్రభావం పడే సూచన ఉందని తహశీల్దారు వి శ్రీనివాసరావు అన్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ తుఫాను సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు.

**అద్దంకి :** కలెక్టర్ ఆదేశాల మేరకు రానున్న మొంథా తుఫాను దృష్ట్యా మునిసిపల్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ డి రవీంద్ర తెలిపారు. పట్టణ ప్రజలు ఎటువంటి సహాయం కొరకైనా 93429 29342 కు ఫోను చేయవచ్చని తెలిలపారు.

# నేడు ఇంకొల్లులో శనగ రైతు సదస్సు

**ప్రజాశక్తి - యద్దనపూడి**

మండలంలోని చింతపల్లిపాడు, యనమదల, యద్దనపూడి, గన్నవరం, పూనూరు, చింతగుంటపాలెం గ్రామాల్లో రైతు సంఘం నాయకులు ఆదివారం పర్యటించారు. నేడు ఇంకొల్లులో జరగనున్న శనగ రైతు సదస్సుకు హాజరు కావాలని రైతులకు కరపత్రాలు ఇచ్చి అవగాహన కల్పించ్చారు. రైతు సంఘం జిల్లా ఉపాద్యాక్షుడు కందిమళ్ళ రామాకోటేశ్వ రరావు మాట్లాడుతూ గతేడాది పండించిన శనగలు కోల్డ్ స్టోరేజీల్లో ఉన్నాయని, వాటిని వెంటనే కొనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతేడాది పండించిన శనగలు కోనేనాధుడు లేడని రైతులు వాపోయారు. పాత వాటిని కొంటేనే మరల పెట్టుబడి పెట్టు కోనేదానికి అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. గతంలో ప్రభుత్వమే యర్ర శనగలు రూ.7600కు కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. తెగుళ్ళ, ఇతర వాతావరణం సమస్యలతో ఖర్చులు పెరిగినందు వల్ల ప్రభుత్వమే శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఎర్రశనగలు రూ.8వేలు, తెల్ల శనగలు రూ.10వేలకు కొనుగోలు చేయాలని కోరారు. రైతు సదస్సుకు వచ్చి ఇతర సమస్యలపై చర్చిచేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. యద్దనపూడి, మార్టూరు మండలాల నాయకులు కృష్ణ మూర్తి, రైతులు సుబ్బారావు, కృష్ణ, వెంకట్రావు, శ్రీను, రాజు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎస్‌ఒ ఎస్ లవన్న

## అధికారులు అప్రపత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి - పర్చూరు**

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రాబోయే మూడు రోజులు అధికారులు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎస్ లవన్న సూచించారు. అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వ భవనాల్లో ఆశ్రయం కల్పించాలని తెలిపారు. అనంతరం ఉప్పుటూరులోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో తహశీల్దారు పి బ్రహ్మయ్య, ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్, డిప్యూటీ ఎంపిడిఒ కె సత్యనారాయణ, ఎస్‌ఐ జీవి చౌదరి, ఎంఈఓ శివ కోటేశ్వరరావు, ట్రైనీ ఎస్‌ఐ గోపి, ఎపిఎం రామకృష్ణ, పిఆర్ ఎఈ శ్రీనివాసరావు, ఎపిఒ రమేష్ పాల్గొన్నారు.



యజమానులు, డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ

## రోడ్డు భద్రత పాటించాలి

**ప్రజాశక్తి - ఇంకొల్లు**

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు నిర్వాకులు, డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్‌ఐ జి సురేష్ చెప్పారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. ఇటీవల కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదం దృష్ట్యా ఎస్పి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చీరాల డిఎస్పి ఎండి మొయిన్ ఉత్తర్వల ప్రకారం సిఐ వైవి రమణయ్య పర్యవేక్షణలో ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు, డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమ నిభంధనలపై అవగాహన కల్పించారు. అర్ధరాత్రి పోలీసులు చేసే 'ఫేస్ వాష్'కు సహకరించి మొఖం శుభ్రంగా కడుక్కొని నిద్రమత్తు వదిలించుకోవాలని అన్నారు.



మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర నాయకులు కుర్రా రామారావు

## చెకుముకి ప్రశ్నల తయారీపై వర్క్‌షాప్

**ప్రజాశక్తి - చీరాల**

విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంలో జెవివి నిర్వహిస్తున్న చెఖుముకి సైన్స్ ప్రతిభా పరీక్షలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జెవివి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో చెఖుముకి సైన్స్ సంబరాల ప్రశ్నల తయారీపై ఉపాధ్యాయుల వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంపొందించడం, మూఢ నమ్మకాలు నిర్మూలించడం వంటి లక్ష్యాలతో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో విజ్ఞానాన్ని వ్యాప్తి చేయాలంటే విద్యార్థి దశనుండే శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసే విధంగా ప్రశ్నలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు గుమ్మ శ్రీను, మాల్యాద్రి, జి సూరిబాబు, కుర్ర శ్రీను, సోమశేఖర్ పాల్గొన్నారు.



నాగులపాలెం వద్ద పరిశీలిస్తున్న అధికారులు

## ముంపునకు గురికాకుండా చూడండి

**ప్రజాశక్తి - పర్చూరు**

మండలంలోని నాగులపాలెం హైవే పక్కన ఉన్న పొలాలు వరద ముంపుకు గురి కాకుండా చూడాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎస్ లవన్న హైవే నిర్మాణ సిబ్బందికి సూచించారు. రెవిన్యూ సిబ్బంది నాగులపాలెం, ఉప్పుటూరు రైతులు తోకలిసి పరిశీలించారు. ద్వారకామయి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, నాగులపాలెం నుండి కప్పల వాగు కాలువ వరకు హైవే రోడ్డు వెంబడి కాలువ నీటి పారుదల గురించి అడిగి తెలుసుకున్నారు. ముంపుకు గురికాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దారు బ్రహ్మయ్య, టిడిపి నాయకులు షేక్ హుస్సేన్, కొల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నాగమల్లేశ్వరరావును పరామర్శిస్తున్న అశోక్ బాబు

## నాగమల్లేశ్వరరావుకు పరామర్శ


**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

మండలంలోని జువ్వలపాలెంకు చెందిన వైసిపీ కార్యకర్త బడుగు నాగమల్లేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైసీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు వైసీపీ నాయకులతో కలిసి ఎయిమ్స్ హాస్పిటల్‌కు వెళ్లి నాగమల్లేశ్వరరావును పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

## బ్లీచింగ్, సున్నం సిద్ధం చేసుకోండి

**ప్రజాశక్తి - బాపట్ల**

మొంథా తుఫాన్ నేపథ్యంలో ముందస్తుగా పంచాయతీల్లో శానిటేషన్ నిర్వహణకు అవసరమైన బ్లీచింగ్, సున్నం నిల్వలతో పాటు సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని ఆర్డీఒ పి గ్లోరియా సూచించారు. నందిరాజుతోట పంచాయతీలో బ్లీచింగ్, సున్నం నిల్వలను పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆమె వెంట కార్యదర్శి పల్నాటి శ్రీరాములు ఉన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న నక్క ఆనందబాబు

## వివాహ వేడుకల్లో ఆనందబాబు

**ప్రజాశక్తి - కొల్లూరు**

మండలంలోని జువ్వలపాలెంకు చెందిన భూపతి వెంకటేశ్వరరావు (లేటు), అక్కమ్మ కుమారుడు అక్షయ కుమార్, రాశి వివాహ వేడుకల్లో శాసన సభ్యులు నక్క ఆనందబాబు, తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్, ఎల్‌ఐ డిఐపీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ వేములపల్లి రవి కిరణ్, దోనేపూడి పిఎసిఎస్ డైరెక్టర్ బుజ్జి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ రవికుమార్

## విలు విద్యలో విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - వేటపాలెం**

ఎపి ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి విలువిద్య పోటీల్లో హెూరిజన్ పాఠశాల విద్యార్థులు మరోసారి ప్రతిభ చాటారు. పాఠశాల 7వ తరగతి విద్యార్థులు రాము, నవదీప్, కె జాన్‌వెస్లీ అద్భుత ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల్లో అభినందన సభ నిర్వహించారు. పాఠశాల సెక్రటరీ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ విలు విద్య కేవలం క్రీడ కాదని మానసిక శక్తి, క్రమశిక్షణ, ఏకాగ్రత పెంపొందించే సాధన అన్నారు. ఆటలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. రాష్ట్రస్థాయిలోనూ మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎల్ రాజు, జాతీయ స్థాయి కోచ్‌లు పాల్గొన్నారు.



సత్యనారాయణను సత్కరిస్తున్న కార్యదర్శులు

## సత్యనారాయణకు ఉద్యోగోన్నతి

**ప్రజాశక్తి - పర్చూరు**

మండలంలోని చెరుకూరు పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శిగా, ఇన్చార్జ్ ఈవోపీఆర్డీగా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన కె సత్యనారాయణ ఈఓపిఆర్డిగా పదోన్నతి పొందారు. పంచాయతీ కార్యదర్శులు ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యాలయంలో పూల మాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్, ఎపిఎం రామకృష్ణ, సీనియర్ సహాయకులు పి నారాయణరావు, వెంకటేశ్వర్లు, కార్యదర్శు లు నరసయ్య, హరిప్రసాద్, ఎం శ్రీనివాసరావు, మస్తానరా వు, వెంకట సుబ్బారావు, కృష్ణమోహన్, కె రామబ్రహ్మం, పిఆర్ ఎఈ శ్రీనివాసరావు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షంషుద్దీన్, మక్కిన శేఖర్ బాబు పాల్గొన్నారు.

## టిడిపి మండల అధ్యక్షునిగా 'మురళి'

**ప్రజాశక్తి - అద్దంకి**

టిడిపి మండల అధ్యక్షుడు మానం మురళీమోహన్ దాస్, ఉపాధ్యక్షులు గాలం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ బాబు, కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టిడిపి సంస్థాగత ఎన్నికల్లో భాగంగా స్థానిక పోతురాజు గండిలోని కార్యాలయంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు జానకిరామయ్య వడ్లమూడి, తోట గోపి, తన్నీరు కాసిశ్రీను, కార్యదర్శులు రామాంజనేయులు చందలూరి, జినుగు కోటిరెడ్డి, మరియదాసు మురికిపూడి ఎన్నికయ్యారు.



గ్రంధాలయం పరిశీలిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

## గ్రంధాలయానికి సొంత భవనం నిర్మించాలి : డివైఎఫ్ఐ

**ప్రజాశక్తి - రేపల్లె**

గ్రంధాలయానికి సొంత భవనం నిర్మించి ఖాళీగా ఉన్న గ్రంథాలయ పోస్టులు భర్తీ చేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యం లో పట్టణంలోని శాఖ గ్రంధాలయాన్ని పరిశీలించారు. అనంతరం డివైఎఫ్ఐ కార్యదర్శి కెవి లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రంథాలయం నిర్వహిస్తున్న అద్దె భవనం పూర్తిగా పాడైపోయిందని అన్నారు. స్లాబు పగిలిపోయి వర్షపు నీరు పడుతుందని అన్నారు. పట్టణ ప్రాంతంలోని విద్యార్థులు, యువకులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు గ్రంధాలయాన్ని ఉపయోగించుకుంటున్నారని అన్నారు. గ్రంధాలయానికి సొంత భవనం నిర్మించాలని, సిబ్బందిని నియమించాలని కోరారు. చంద్రమౌళి పార్క్ ఆవరణలో 15 సెంట్లు స్థలం ఉందని, గతంలో రూ.1.05కోట్ల నిధులు కేటాయించారని, ఆచరణలో ఏమి జరగలేదని అన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ అధ్యక్షులు సిహెచ్ ప్రకాష్, ఎం సూర్య, ఎం రత్నబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవాదాయ జెసి సూర్యచంద్రశేఖర ఆజాద్

## దేవాదాయ భూములు నమోదు చేయాలి

**ప్రజాశక్తి - అద్దంకి**

శ్రీ సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నందు సంయుక్త కమిషనర్ సూర్య చంద్ర శేఖర ఆజాద్ ఆధీనంలోని దేవస్థాన సంస్థలకు చెందిన భూములు రెవిన్యూ రికార్డుల్లో నమోదు కాని వాటిని వెంటనే నమోదు చేయించాలని, దేవాదాయ శాఖ ఆధీనంలోని దేవస్థానములు, సంస్థలకు ప్రాపర్టీ రిజిస్టర్ తయారు చేయుటకు తగు సూచనలు చేశారు. సమావేశంలో డిసి కెబి శ్రీనివాస్, ప్రకాశం జిల్లా డిఇఒ పొనకలరావు, బాపట్ల జిల్లా సహాయ కమిషనర్, ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి మదమంచి తిమ్మనాయుడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల ఇఒలు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి

**ప్రజాశక్తి - బాపట్ల**

మొంథా తుఫాను తీవ్రత దృష్ట్యా వైసిపి శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి కార్యకర్తలను ఆదేశించారు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవాని పాలెం అధ్యక్షులు, సముద్రతీర గ్రామాల్లోఇన వైసీపీ నాయకులతో ఆయన మాట్లాడారు. ప్రజలకు తుపాను తీవ్రత తగ్గే వరకు అందుబాటులో ఉండాలని అన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - పర్చూరు**

మండలంలోని చిన్నంభట్ల అగ్రహారం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైనట్లు ఎస్ఐ జీవి చౌదరి తెలిపారు. సుమారు 35 నుండి 45ఏళ్ల మధ్య వయస్సు గల మగ మనిషి శవం చిన్నంబొట్ల అగ్రహారం అడ్డరోడ్డు వద్ద నీళ్ల కుంటలో తేలియాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు వెళ్లి చూడగా శవం నీళ్లపై తేలియాడుతున్నదని తెలిపారు. కుంట పక్కన గల రోడ్డు మార్జిన్‌లో ఎపి 16 సిఎఫ్ 2152 నంబరు గల మోటార్ సైకిల్ నిలిపి ఉందని అన్నారు. గుర్తుతెలియని మనిషి గురించి చుట్టుపక్కల విచారించగా సరైన సమాచారం లేదని తెలిపారు. మోటార్ సైకిల్ ఆపి రోడ్డు ప్రక్కన మూత్ర విసర్జన చేసే సమయంలో కాలు జారి కుంటలోకి పడి ఊపిరాడక చనిపోయినట్టుగా ఉన్నదని తెలిపారు. తిమ్మరాజుపాలెం విఆర్ఓ కన్నమర్లపూడి సునీత రిపోర్ట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సమాచారం ఎవరికైనా తెలిస్తే 91211 02150 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# ఒకేచోట మరమ్మతులు ఎన్ని సార్లు.?

**ప్రజాశక్తి - బాపట్ల**

పట్టణంలో ప్రతిరోజు అంతర్గత నీటి పైపులు లీకుల మయంగా మారాయి. ఒకే చోట నాలుగు సార్లు పైపులు లీకులకు మరమ్మతులు చేసినా తిరిగి అక్కడే మళ్ళీ లీక్ అవుతూనే ఉంది. పైపుల మరమ్మత్తుల విషయంలో నాణ్యతలేని పనులు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. పురపాలక ఇంజనీరింగ్ విభాగంలో పైపులు బిగించడంలో నైపుణ్యం లేని సిబ్బందితో పని చేయిస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. లీకైన పైపుల్ని ప్రతిసారీ మరమ్మతులు చేస్తున్నారేతప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. గడియార స్తంభం వద్ద పది రోజుల క్రితమే లీకైన పైపులకు మరమ్మత్తులు చేశారు. కనీసం వారం గడవక ముందే మళ్లీ అక్కడే పైపు లీకు కావడంతో తాగునీరు వృధాగా పోతుంది. దీంతో నీళ్లు కలుషితం అవుతున్నాయి. ప్రధాన రహదారిలో తరచూ పైపులీకులతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. నాలుగు రోడ్లు కలిసే ప్రధాన కూడలి గడియార స్తంభం వద్ద తరచూ పైపుల లీకులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన సెంటర్లో నిత్యం సమస్యగా మారుతున్నప్పటికీ శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ దృష్టి సారించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారుల పనితీరు చూస్తే రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్లతో నడిచిందన్న చందంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. లీక్ అవుతున్న పైపులన్నీ కొత్త పైపులుగా మార్చాలంటే రూ.కోట్లలో ఖర్చవుతుందని కమిషనర్ ఇటీవల చెప్పుకొచ్చారు. పట్టణంలో త్రాగునీటి పైపుల లీపుల సమస్యతో పట్టణ ప్రజలకు సరఫరా చేసే నీరు కలుషితమై రోగాలు వస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 13న 'వరుసగా పైప్ లైన్ మరమ్మత్తులు' అనే శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తా కథనం విధితమే.


గడియార స్తంభం వద్ద లీకౌతున్న పైప్ లైను

# జెఆర్ఎఫ్‌లో ఎజి కాలేజి విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - బాపట్ల**

జూనియర్ రీసెర్చ్ ఫెలో 2025 (జెఆర్ఎఫ్) జాతీయ ప్రవేశ పరీక్షల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ పి ప్రసూనరాణి ఆదివారం తెలిపారు. ఐసిఎఆర్ ఏఐఈఈఏ జాతీయ స్థాయి పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షలో కళాశాలకు చెందిన బిఎస్సీ ఆనర్స్ ఏజి 2021 బ్యాచ్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. జిఎస్ రంగనాథ్ ప్లాంట్ సైన్సెస్‌లో అఖిల భారత స్థాయిలో ఏజి కళాశాల విద్యార్థిని వి ప్రత్యూష 2వ ర్యాంకు, ప్లాంట్ సైన్సెస్‌లో 43వ ర్యాంకు సాధించారు. మేడపాటి జిఎస్ సాహితి ప్లాంట్ బయోటెక్నాలజీలో, పి హుస్సేన్ ఖాన్ 1వ ర్యాంకు, ప్లాంట్ బయోటెక్నాలజీలో 38వ ర్యాంకు, ఫిజికల్ సైన్సెస్‌లో జి బృహతి 20వ ర్యాంకు, కె మహిమ 161వ ర్యాంకు సాధించారని అన్నారు. ప్లాంట్ సైన్సెస్, ఎంటమాలజి అగ్రానమిలో అనేక మంది విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షలో 10 నుండి 50 ర్యాంకులు సాధించినట్లు వివరించారు. ప్లాంట్ సైన్సెస్‌లో 20 మంది విద్యార్థులు అర్హత సాధించగా ఎంటమాలజిలో 14 మంది, అగ్రానమిలో 13 మంది విద్యార్థులు, ప్లాంట్ బయోటెక్నాలజీలో ముగ్గురు విద్యార్థులు, సోషల్ సైన్సెస్‌లో ఇద్దరు, ఫిజికల్ సైన్సెస్, స్టాటిస్టికల్ సైన్సెస్‌లో జాతీయ స్థాయిలో 200 నుండి 900 వరకు ర్యాంకులు సాధించి జాతీయస్థాయిలో ప్రముఖ విశ్వవిద్యాలయాలైన న్యూఢిల్లీ ఐఎఆర్ఐ, రాంచి ఐఎఆర్ఐ, ఛత్తీస్‌గఢ్, రాయిపూర్, ఐఎఆర్ఐ, కోయంబత్తూర్ టిఎన్ఎయు, ఉత్తరప్రదేశ్ ఐవిఆర్ఐ, ధార్వాడ్ యుఎఎస్, కాశ్మీర్ ఎస్‌కెయుఎస్‌టిలో సీట్లు పొందినట్లు తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ఖ్యాతిని దశ దిశలో వ్యాప్తి చేసిన విద్యార్థులను అభినందించారు.


వి ప్రత్యూష


జిఎస్ రంగనాథ్


జి బృహతి

# 'కోటి సంతకాల'కు విశేష స్పందన

**ప్రజాశక్తి - వేటపాలెం**

ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని వైసిపి మండల అధ్యక్షులు సాదు రాఘవరావు అన్నారు. మండలంలోని పందిళ్లపల్లి స్టేజీ వద్ద వైద్య కాలేజీల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన సంతకాల సేకరణ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ అధ్యక్షుడు గుత్తి మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పిట్టు హనుమంత్‌రెడ్డి, నాయకులు ఆసోది శివారెడ్డి, వాలి ఆదినారాయణరెడ్డి, సజ్జ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రొండా శ్రీనివాస్‌రెడ్డి, పృధ్వి ఆంజనేయులు, పిచ్చుక వెంకట సుబ్బారావు, చొప్పవరపు సుబ్బారావు, గుంటూరు శ్రీనివాసరావు, బొడ్డు సుబ్బారావు, యారాసు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

**ఇంకొల్లు :** వైద్య కాలేజీల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ప్రచురించిన బుక్‌లెట్లు పంపిణీ చేస్తూ ప్రజల నుండి సంతకాలు సేకరిస్తున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు చిన్ని పూర్ణచంద్రరావు తెలిపారు. పావులూరు, నాగండ్ల, సూదివారిపాలెం, ఇడుపులపాడు, ఇంకొల్లు, దుద్దుకూరు, కొనికి గ్రామాల్లో బుక్లెట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తాటిపర్తి వెంకటలక్ష్మి, పాలపర్తి ఆమని, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.


వేటపాలెంలో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

# కల్తీ మద్యమే కారణం: వరికూటి

**ప్రజాశక్తి - వేమూరు**

మూడు రోజుల క్రితం కర్నూలు వద్ద జరిగిన బస్సు దగ్ధం దుర్ఘటనకు కల్తీ మధ్యమే కారణమని వైసిపి ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మద్యం విచ్చలవిడిగా పెరిగిపోవడమే కాక ప్రతి గ్రామంలో మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు చేపట్టడం, కల్తీ మద్యం విక్రయిస్తున్నారని అన్నారు. బస్సు దగ్ధమైన సమయంలో శివశంకర్ పూర్తిగా కల్తీ మద్యం సేవించడం వలననే డివైడరును ఢీ కొట్టి బైకు తిరగబడటం, దానిపై వేగంగా వస్తున్న ట్రావెల్ బస్సు నెట్టుకుంటూ వెళ్లి మంటలు చెల్లారేగటంతో బ్యాటరీలు కాలిపోయి దుర్ఘటనకు కారణమైందని అన్నారు. ఈ దుర్ఘటనకు బాధ్యత ప్రభుత్వమేనని ఆరోపించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



వైసిపి ఇన్‌ఛార్జి అశోక్ బాబు


కాఫీ సెంటర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

## అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం

**ప్రజాశక్తి - మార్టూరు రూరల్**

ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. ప్రజల అవసరాలు తీర్చే విధంగా గ్రామాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. మార్టూరులో అభివృద్ధి కార్యక్రమాలు ఆదివారం ప్రారంభించారు. మార్టూరు హైవేపై డిఆర్డిఎ సెర్ఫ్ సహకారంతో ఏర్పాటు చేసిన అరకు కాపీ సెంటర్ ప్రారంభించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో గ్రామ స్థాయిలో స్వయం ఉపాధి బలపడాలని ఆకాంక్షించారు. అనంతరం సుగాలి తండాలో ఎఫర్ట్, ఏకం అమెరికా స్వచ్చంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. శుద్ధమైన తాగునీరు అందించడం ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రూ.60 లక్షల విలువైన సిసి రోడ్ల పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఫర్ట్ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న ఎంఎల్ఎ ఆనందబాబు

## తిరుపతిరావు కుటుంబానికి పరామర్శ

**ప్రజాశక్తి - అమృతలూరు**

మండలంలోని కోరుతాడిపర్రు గ్రామానికి చెందిన పెదపూడి సొసైటీ డైరెక్టర్ జూటూరి తిరుపతిరావు (55) సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. సభకు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు హాజరై తిరుపతిరావు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తిరుపతిరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.


చెక్కుల అందజేస్తున్న ఆనందబాబు

## సిఎం సహాయనిధి అందజేత

**ప్రజాశక్తి - వేమూరు**

సిఎం సహాయ నిధి నుండి నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.5.1 కోట్లు లబ్దిదారులకు అందజేసినట్లు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు తెలిపారు. చుండూరు మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సిఎం సహాయ నిధి నుండి అందిన చెక్కులు ఆదివారం అందజేశారు. చుండూరుకు రూ.1.09 కోట్లు, అమర్తలూరుకు రు.1.03కోట్లు, వేమూరుకు రు.90.11 లక్షలు, కొల్లూరుకు రు.97.10 లక్షలు, భట్టిప్రోలుకు రు.1.17కోట్లు చొప్పున రు.5.1కోట్లు 677 లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు.

## 28న వైసిపి నిరసన వాయిదా

**ప్రజాశక్తి - ఇంకొల్లు**

ఈనెల 28న వైద్య కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన నిరసన ర్యాలీ వాయిదా పడినట్లు వైసిపి ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి తెలిపారు. ఇంకొల్లు, పర్చూరు, యద్దనపూడి, మార్టూరు అధ్యక్షులు చిన్ని పూర్ణచందర్రావు, జువ్వ శివప్రసాద్, వేణుబాబు, జంపని వీరయ్య, బండారు ప్రభాకరరావు, రావూరి చౌదరి తెలిపారు. నవంబర్ 4న నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు

## 8 మంది ప్రయాణికులు, ముగ్గురు సిబ్బంది సురక్షితం




ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు

**ప్రజాశక్తి-మార్కాపురం రూరల్**

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన ఘటన మండల పరిధిలోని వేములకోట గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఆర్‌విటి ప్రైవేట్ ట్రావెల్ సర్వీస్ బస్సు మార్కాపురం నుండి బెంగళూరుకు ఆదివారం రాత్రి బయలుదేరింది. వేములకోట గ్రామం సమీపంలో మూలమలుపు వద్ద ఒక్కసారిగా బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ముళ్ళకంపలోకి దూసుకొని వెళ్ళింది. ఈ సమయంలో బస్సులో ఎనిమిది మంది ప్రయాణికులు, ముగ్గురు సిబ్బంది ఉన్నారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పిలుచుకున్నారు. మార్కాపురం పట్టణం నుండి ఈ బస్సు బయలుదేరుతున్న సమయంలో మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. సుబ్బారావు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఏ. మాధవరావు తనిఖీలు నిర్వహించారు. బస్ డ్రైవర్‌తో మాట్లాడి ప్రతి ఒక్క నిమిషం అప్రమత్తంగా ఉండాలని సూచించిన అధికారులు చెప్పిన అరగంటలోపే ఈ ప్రమాదం చోటు చేసుకోవడంపై పుర ప్రజలు బస్సులోని ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఎస్ఐ అంకమ్మరావు సిబ్బందితో హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన బస్సును పరిశీలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

శివారు కాలనీలు మునిగిపోతున్నా..

# అధికారులు మౌనం

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

గత నాలుగు రోజుల వర్షాల కారణంగా ఒంగోలు నగర పరిధిలోని శివారు కాలనీల్లో రోడ్లు ధ్వంసమై, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కానీ అధికారులు మౌనం వహిస్తున్నారని సిపిఎం నగర కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం సిపిఎం స్థానిక శాఖ ఆధ్వర్యంలో గోపాల్‌నగరం, భగత్‌సింగ్ కాలనీ, కేశవరాజుగుంట, ఉదయం కాలనీ వంటి ప్రాంతాల్లో పార్టీ బందం పర్యటించింది. ఈ సందర్భంగా నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలోని శివారు ప్రాంతాల కాలనీల్లో రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయన్నారు. గోపాల్‌నగర్, కేశవరాజు గుంట, ఉదయం కాలనీ, భగత్‌సింగ్ కాలనీ వంటి ప్రాంతాల్లో గడ్డి కయ్యలతోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని, వెంటనే మరమ్మత్తు చేపట్టడంతో పాటు సైడ్ కాల్వలను నిర్మించాలన్నారు. పార్టీ నాయకులు తంబి శ్రీనివాసులు మాట్లాడుతూ గోపాల్‌నగరంలోని శ్రీకష్ణ కాలనీలో 1వ లైన్ నుంచి 6వ లైన్ వరకు రోడ్లు పూర్తిగా ఛిద్రం అయ్యాయని, వీటిని వెంటనే పునర్నిర్మించాలని, స్థానిక ఎమ్మెల్యే మరియు కమిషనర్ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు సీతారామకష్ణ, కే. వంశీధర్, బి. భవన్నారాయణ, కే. సత్యవతి, జి. సత్యవతి, కే. మంగమ్మ పాల్గొన్నారు.

**సిపిఎం ఆగ్రహం**



ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం నేత శ్రీనివాసరావు

# మహాసభలను విజయవంతం చేయాలి

## సిఐటియు జిల్లా కమిటీ పిలుపు

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

ప్రకాశం జిల్లాలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రభుత్వ వ్యతిరేక విధానాలను బహిర్గతం చేస్తూ నవంబర్ 8, 9 తేదీలలో దరిశిలో జరిగే సిఐటియు 13వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం నాడు స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయం జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సమావేశ నిర్ణయాలను జిల్లా ప్రధాన కార్యదర్శి యం. రమేష్ పత్రికలకు వివరించారు.ఈ మహాసభల ప్రారంభ సందర్భంగా నవంబర్ 8న దర్శి లో జరగనున్న భారీ ప్రదర్శన మరియు బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు.ఈ బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్. నరసింగరావు, రాష్ట్ర కార్యదర్శులు కారుసాల సుబ్బరావమ్మ, కె ఉమామహేశ్వర రావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. సమావేశంలో సీఐటీయూ ఆఫీస్ బేరర్స్ జి.వి. కొండారెడ్డి, జి. శ్రీనివాసులు, పి. కల్పన, చీకటి శ్రీనివాసరావు, టి. మహేష్, పి. ఆంజనేయులు, బంకా సుబ్బారావు, టి. రాము, టి. ఆవులయ్య, పారా శ్రీనివాసరావు, సి హెచ్. చిరంజీవి, జి.వి. రాగయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

# సముద్రం వద్దకు ప్రవేశం లేదు..

## పోలీస్ కమాండ్ కంట్రోల్ నంబర్ 8333813228 ఏర్పాటు

**ప్రజాశక్తి- బాపట్ల జిల్లా**

తుపాను విపత్తు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని ఎటువంటి ప్రాణ నష్టం సంభవించకుండా ప్రజలకు భద్రత కల్పించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తి సిద్ధంగా ఉంది. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు వాతావరణ శాఖ ఇచ్చిన తుపాను హెచ్చరికలను దష్టిలో ఉంచుకుని ఆదివారం జిల్లా పరిధిలోని సముద్రతీర ప్రవేశ మార్గాలను జిల్లా పోలీస్ అధికారులు మూసివేశారు. ఫ్లెక్సీల ఏర్పాటు చేసి తుపాను కారణంగా తాత్కాలికంగా తీరాలు మూసివేయబడినట్టు ప్రజలకు తెలియజేశారు. లైఫ్ జాకెట్, రోప్, కట్టర్, జెసిబి, క్రేన్, ట్రాక్టర్ లను జిల్లా పోలీస్ అధికారులు వారి పరిధిలో సిద్ధంగా ఉంచారు. గాలుల తీవ్రత వల్ల హోర్డింగ్స్ పడిపోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండడంతో ముందస్తు చర్యలలో భాగంగా గ్రామ పంచాయతి, మున్సిపల్ అధికారుల సహకారంతో వాటిని తొలగిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలను పోలీస్ అధికారులు కలిసి తుఫాను పరిస్థితులు గురించి వివరించి సురక్షిత ప్రాంతాలకు లేదా ప్రభుత్వం సూచించే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. అదేవిధంగా వాగులు, కాలువలు, నదులు ఉప్పొంగి ప్రవహించినప్పుడు కరకట్టలు తెగే అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఈదురుగాలులతో స్తంభాలు, చెట్లు విరిగి పడితే రహదారి మార్గాలను క్లియర్ చేసి, ట్రాఫిక్ సవ్యంగా కొనసాగించేందుకు డోజర్లు, జెసిబిలు, క్రేన్‌లు, కట్టర్లు సిద్ధంగా ఉంచారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడానికి హ్యాండ్ మైకులు సిద్ధం చేసుకున్నారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు పోలీస్ శాఖను జిల్లా ఎస్పీ సంసిద్ధం చేశారు. విపత్తు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని జిల్లా ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సన్నద్ధంగా ఉంది. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ శాఖ నుండి తక్షణ సహాయం పొందేందుకు కమాండ్ కంట్రోల్ నంబర్ 8333813228 ను ఏర్పాటు చేశారు.




బీచ్‌లోకి ఎవరూ ప్రవేశించకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసిన జిల్లా పోలీసులు

# హెచ్‌ఎంలు తప్పనిసరిగా హాజరుకావాలి

## డిఇఒ కిరణ్‌కుమార్

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

తుఫాన్ నేపథ్యంలో 27, 28, 29 తేదీలలో పాఠశాలలకు సెలవులు ప్రకటించి నప్పటికి హెడ్ మాస్టర్లు తప్పనిసరిగా హాజరు కావాలని పాఠశాలల విద్యాశాఖ కమిషనర్ ఆదేశించినట్లు డిఇఒ ఏ కిరణ్ కుమార్ ఆదివారం రాత్రి ప్రకటించారు. ఈ మూడు రోజులు విద్యార్థులకు మాత్రమే సెలవులు ప్రకటిం చగా, ప్రధానోపాధ్యాయులుతప్పనిసరిగా పాఠశాలకు హాజరుకావాలని ఆదేశించారు.

ఈ మూడు రోజులు లీప్ యాప్‌లో ప్రతిరోజూ ఇన్ టైం మరియు అవుట్ టైం అటెండన్స్ నమోదు చేయాలని సూచించారు. తుఫాను కారణంగా పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్లయితే, పాఠశాల వస్తువుల సంరక్షణ బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని గుర్తుచేశారు.తుఫాను ప్రభావంతో పాఠశాలకు నష్టం జరిగితే వెంటనే ఫోటోలు తీసి మండల విద్యా అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. మిడ్డే మీల్ ఏజెన్సీలు కూడా పాఠశాలలో అందుబాటులో ఉండాలని సూచించారు. అదనంగా విద్యార్థుల తల్లిదండ్రులను ఫోన్ ద్వారా లేదా ప్రత్యక్షంగా కలిసి తుఫాను ప్రభావం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు.

# తీరమంతా హరిత కవచం

- తీరంలో గ్రేట్ గ్రీనరి వాల్..
- రెండు జోన్లుగా ఆగ్రో ఫారెస్ట్ అభివృద్ధి
- ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ
- జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ వినోద్‌కుమార్

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

జాతీయ విపత్తులు సంభవించినప్పుడు, తీరప్రాంతంలోని ప్రజలకు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లకుండా నిలువరించేనేందుకు గ్రేట్ గ్రీన్ వాల్ పథకం పేరుతో ప్రకతి వైపరీత్యాల నుంచి రక్షణ కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బహత్తార కార్యక్రమం చేపట్టిందని జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ (టెరిటోరియల్) కె.వినోద్ కుమార్ స్పష్టం చేశారు. తరచూ వచ్చే తుఫాన్లు, సునామీల నుంచి సముద్ర తీరంలో ఉవ్వెత్తున ఎగిసిపడే అలలు తాకిడిని తట్టుకుని, ముంపు ప్రభావాన్ని తగ్గించే దిశగా ఈ ప్రక్రియ దోహదపడుతుందన్నారు. ఐదేళ్ల కాలంలో రాష్ట్ర పరిధిలో తీరప్రాంతం మొత్తం హరితవనంగా తీర్చిదిద్దే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ ఆదేశాలకనుగునుగుణంగా ఈ పథకం రూపొందించినట్లు చెబుతున్న ఆయనతో 'ప్రజాశక్తి' ముఖాముఖి..

**జిల్లాలో 50 కిలోమీటర్లు తీరం అభివృద్ధి..**

గ్రేట్ గ్రీన్ వాల్ పథకంలో భాగంగా రాష్ట్ర పరిధిలో ఇచ్చాపురం నుంచి తడ వరకు 1043 కిలోమీటర్లు తీరప్రాంతం రాబోయే ఐదేళ్ల కాలంలో హరితహారంగా అభివృద్ధి పరుస్తారు. ప్రకాశం జిల్లాలో 50 కిలోమీటర్లు తీరంలో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తొలుత లక్ష తాటిచెట్లు పెంచే కార్యక్రమంలో భాగంగా తాటి టెంకలు నాటే కార్యక్రమం జరుగుతుంది. ముఖ్యంగా తీరప్రాంతం పరిధిలోని కనపర్తి, గుండమాల, కొత్తపట్నం, ఈతముక్కల, కె.పల్లెపాలెం, పాకల తదితర ప్రాంతాల్లో సరుగుడు చెట్లు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. తీర ప్రాంతం మొత్తం హరిత హారంగా ఏర్పాటు చేయడంవల్ల సముద్రం అల్లకల్లోలం జరిగినపుడు ఈ వనాలు ముప్పు తీవ్రతను తగ్గిస్తాయి. సముద్రం కోతకు గురికాకుండ, తీరాన్ని ముంచెత్తకుండా నిలువరించేందుకు దోహదపడుతుంది.



ముఖాముఖి

**రెండు జోన్లుగా ఆగ్రోఫారెస్ట్ అభివృద్ధి...**

సముద్ర పరివాహక ప్రాంతంలో అటవీ భూములు కన్నా, ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూములు ఎక్కువగా ఉన్నాయి. జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారుల సహకారంతో ప్రభుత్వ భూముల్లో, ప్రైవేట్ వ్యక్తుల సహకారంతో ప్రైవేట్ భూముల్లో ఆగ్రో ఫారెస్ట్‌ను అభివద్ధి చేయవలసి ఉంది. తొలుత సిఆర్‌జడ్ పరిధిలో 500 మీటర్లు మేర తాటి, సరుగుడు చెట్లు పెంచే ప్రక్రియ చేపట్టాలి. రెండో దశలో 500 మీటర్లు మొదలుకొని 5 కిలోమీటర్లు వరకు ప్రభుత్వ భూములు ఉంటే కలెక్టర్ అనుమతితో చెట్లు పెంచే కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది. ప్రైవేట్ భూములు, కాలువలు, రోడ్లు ఇరువైపులా కూడా అవెన్యూ ఫారెస్ట్ పెంచే కార్యక్రమం చేపడతాం.

**మడ అడవుల పెంపకం**

మంచినీటి ప్రవాహం వద్ద గుండమాల, గుండ్లకమ్మ, ముసి, పాలేరు వంటి క్రీక్స్( నదీముఖద్వారం) వద్ద మడ అడవులు పెంచేందుకు చర్యలు చేపట్టాలి. మడ అడవులు పెంపకానికి ఈ ప్రాంతాలు అనువైనవిగా గుర్తించాము. మడ అడవులు అభివద్ధి చెందితే ప్రకతి వైపరీత్యాలనుంచి రక్షణ పొందడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, పర్యాటకరంగ అభివద్ధికి తోడ్పడుతుంది.

**ప్రభుత్వ ప్రైవేట్ రంగాల భాగస్వామ్యం...**

ఈ పథకం అమలుకు ప్రభుత్వ రంగ సంస్థలు,ప్రైవేట్ సంస్థలను భాగస్వామ్యం చేయవలసి ఉంది. బ్యాంకులు, ఎల్ ఐసి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ అనుబంధ సంస్థలు, ఐటిసి వంటి కార్పొరేట్ సంస్థలు ఇతర ధాత్రుత్వ సంస్థల ఆర్థిక సహకారం (భాగస్వామ్యం)తో ఈ ప్రక్రియను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.